## 19. పండుగ వచ్చింది ఇంటికి

'వచ్చాడా, వాడు?' దీక్షితులుగారు భార్యను అడిగారు.

సంక్రమణం ఒంటి గంటకు ప్రవేశించింది. బ్రాహ్మణుడు భోజనంచేసి వెళ్లిపోయాడు.

పార్వతమ్మ భర్తకు వడ్డిస్తానంది.

ఆయన రెండు సార్లు నట్టింట్లో పచారు చేశారు.

'నాకు మంచి నీళ్లుకావాలి, దాహంగా ఉంది' అన్నాదాయన.

'భోజనం చెయ్యరా?'

'చెయ్యకేం!'

'ఎప్పుడు?'

'నీకే తెలుస్తుంది'

ఆ యిల్లాలు ఆశ్చర్యపోయి నిలుచుంది.

దీక్షితులుగారికి ముగ్గురు కొడుకులు.

పెద్దవాడు చలమయ్య – చాల పేరుమోసిన అడ్వకేటు. జడ్జికోర్టు దగ్గిర ఉంటున్నాడు.

రెండవవాడు సూర్యనారాయణ – డిప్యూటీ చీఫ్ యింజనీరుగా హైదరాబాదులో పనిచేస్తున్నాడు.

మూడవవాడు శ్రీమన్నారాయణ – వాడే దీక్షితులుగారు అడిగిన 'వాడు.'

దీక్షితులుగారికి చాల పెద్దిల్లుంది. తాతలు కట్టించిన యిల్లు. ఇప్పటికే వాసయోగ్యంగా ఉంది.

చలమయ్య చాలబాగా ఆర్జన చేస్తున్నాడు. జడ్జికోర్టు దగ్గిరే యిల్లు తీసుకున్నాడు. ఊళ్లోనే ఉన్నా తల్లిదండ్రులను చూడడానికి తీరికలేని ప్రాక్టీసు అతనికి.

సూర్యనారాయణ సంవత్సరానికొకసారి వచ్చి తల్లిదండ్రులతో వారం రోజులు గడిపి వెళ్లిపోతాడు.

శ్రీమన్నారాయణ చిన్నప్పటినుంచీ మరో తరహాగా ఉంటున్నాడు. అతను చదువుమీద అంత శ్రద్ధ చూపించలేదు. దీక్షితులు గారు గొప్పవేదపండితులు. కనీసం ఆఖరివాడికేనా రెండు ముక్కలు చెప్పాలని, నమకం చమకం మొదలైనవి వాడిచేత వల్లింపజేశారు. ఉద్యోగం కోసమని, స్కూలుఫైనలు వరకు చదివించారు. అతను తీరిక సమయాలలో ఒక స్నేహితుడి ప్రెస్‌లో పనినేర్చుకునేవాడు.

ప్రెస్సు యజమానికి ఇద్దరు కూతుళ్లున్నారు. వాళ్లు కూడా ప్రెస్‌లో పనిచేసేవారు. పెద్దమ్మాయికి, నారాయణకు పంచయం ప్రేమగామారి, చాలకాలం గుట్టుగా ఆ ప్రణయం

పంపొంది, ఒకమంచిరోజున రిజిస్టరు మారేజికి దారితీసింది.

పెళ్లిచేసుకొని తల్లిదండ్రుల ఆశీర్వచనంకోసం భార్యతో వచ్చిన శ్రీమన్నారాయణ తండ్రికోపానికి బలిఅయాడు. ముగ్గురు కొడుకులలోను బుద్ధిమంతుడనుకున్నవాడు తప్పుదారి తొక్కడం. ఆ తండ్రి సహించలేకపోయాడు. కొడుకుని గడపతొక్కొద్దన్నారు దీక్షితులుగారు.

కొంచెం తక్కువకులం అమ్మాయిని చేసుకున్నాడని తప్ప, నలుగురిలో తనపేరుకు కొడుకు కళంకం తెచ్చాడని ఆయనకు పట్టింపులేదు. లోకంమారుతున్నది. కులాంతర వివాహాలు అంతటా జరుగుతున్నాయి. ప్రభుత్వం కూడా ప్రోత్సాహిస్తున్నది.

మరెందుకాయనకు కోపం?

ఇల్లువిడిచిన శ్రీమన్నారాయణ కొంతకాలం అత్తవారియింటే ఉన్నాడు. వాళ్లప్రెస్సు దివాలా తీసింది. పట్టణంలో బతకలేక ఆ కుటుంబం పల్లెటూరికి వెళ్లిపోయింది.

శ్రీమన్నారాయణ మరో ప్రెస్సులో నెలకు వేయి రూపాయల జీతం మీద ఉద్యోగానికి కుదిరాడు. పట్టణంలో రెండో అంతస్తుమీద, ఒక చిన్నగది మూడు వందల రూపాయలకు అద్దెకు తీసుకున్నాడు. అందులో ప్రస్తుతం భార్యతోను, నాలుగేళ్ల కొడుకుతోను ఉంటున్నాడు.

ఓవర్‌టైమ్ కోసం రాత్రిళ్లుపనిచేసి, ఏదో విధంగా సంసారాన్ని ఈడ్చుకొస్తున్నాడు.

ఈ పెద్ద పండుగకు బోనస్ దొరికితే, తమకి బట్టలు కొనుక్కోలేకపోయినా, పిల్లడికేనా కొనాలని భార్యభర్తలు అనుకున్నారు.

డిసెంబరు నెలలో ప్రెస్సు యజమాని ఒక వర్కరుమీద చెయ్యిచేసుకున్నాడు. దానితో పనివాళ్లందరూ సమ్మెకుదిగారు. ఇవాళో, రేపో సమ్మె ముగుస్తుందని అనుకున్నారు. వర్కర్ల యూనియన్ రంగంలోకి దిగడంతో ఆ అవకాశం దూరమయింది.

సమ్మెకు సంక్రాంతికి సంబంధం లేదు.

భోగి పండుగనాడు శ్రీమన్నారాయణ కుటుంబం ఒక్కపూట మాత్రమే భోజనం చేసింది. వేయవలసినవాళ్లందరి దగ్గిర అప్పులు చేశాడు. అప్పులు యివ్వడానికి స్నేహితులు అతనికి మిగలలేదు.

తండ్రి యింటి గడపతొక్కొద్దన్నాడు. తల్లిమనసు శ్రీమన్నారాయణకు తెలుసు. ఆమెను బాధపెట్టకుండా, నెలకో పదిహేను రోజులకో ఆమెను వీధిలోంచే పలకరించి వస్తుంటాడు నారాయణ. ఆవిడ తనకు తోచినదేదో కొడుక్కియిస్తుంటుంది.

సంక్రాంతినాడు వెళ్తే తప్పకుండా ఆమెచేసినదేదో యిస్తుంది. అందుచేత పొద్దున్న గోధుమనూకతో ఉప్మా చేసుకొని వాళ్లుతిన్నారు. రాత్రికి తల్లి యిచ్చినవి సరిపోతాయి.

తీరా శ్రీమన్నారాయణ బయలుదేరే వేళకు అతని శ్రీమతి అడ్డుకొంది.

'మనకి కూడా పేరుషముంది. వెళ్లిగడపలో నిలుచోని, అడిగి తెచ్చుకోడం నాకిష్టంలేదు.'

దానితో శ్రీమన్నారాయణ, తొడుక్కున్న బట్టలు విప్పి, లుంగీవేసుకున్నాడు.

మధ్యాహ్నం రెండుదాటింది. ఇంట్లో ఉన్న ముగ్గురూ మంచినీళ్లతో కడుపు నింపుకున్నారు.

ఇంతలో గది తలుపు ఎవరో కొట్టి, ఆయాసపడుతూ 'నారాయణా!' అన్నారు.

శ్రీమన్నారాయణ లేచి తలుపుతీశాడు.

ఎదురుగుండా అతని తల్లి పార్వతమ్మ – బుట్టలో కారియరు, ఇంకా ఏదో తినుబడి సామానులు పట్టుకుంది. ఆమె వెనుక, దిగువమెట్టుమీద దీక్షితులుగారు, చంకలో అరిటాకుల కట్టపట్టుకొని నిలుచున్నారు.

తల్లిని, తండ్రిని చూసి మాట లేకుండా, పక్కకు తప్పుకొని వాళ్లు లోపలికి రావడానికి దారి యిచ్చాడు నారాయణ.

దీక్షితులుగారు అరటాకుల కట్టపక్కన పడేసి కోడలినుద్దేశించి అన్నారు. 'అమ్మాయ్! కాళ్లుకడుక్కోవాలి. నీళ్లెక్కడ?'

తొలిసారి మామగారు ఆదరంగా మాట్లాడినందుకు ఆమె ఆశ్చర్యపోయింది.

'మామగారు డాబామీద బాల్టీలో ఉన్నాయి. మీ అబ్బాయి పొద్దున్న స్నానంచేసి నూతి నుండి తెచ్చారు. పక్కనున్న గోలెంలోని మేము వాడుతున్నవి.'

దీక్షితులుగారు నవ్విఅన్నారు.

'అమ్మాయ్! ఏనాడయితే నువ్వు మా నారాయణని పెళ్లాడావో, ఆనాడే నువ్వు భర్త కులానికి మారిపోయావు. కాబట్టి ఈ భేదం పాటించకు.'

కాళ్లుకడుక్కొని వచ్చి ఆయన అన్నారు.

'ఒరేయ్ నారాయణా! నేను కోపంలో నిన్ను మనయింటికి రావద్దన్నాను. కాని, నేను నీ యింటికిరానని అనలేదు. నీకేమీ అభ్యంతరంలేదు కదా?'

చిన్నవాళ్లిద్దరూ లెంపలు వేసుకొని అటువంటి మాటఅనవద్దన్నారు.

'ఈ సంక్రాంతికి మనం దూరమయి అయిదేళ్లయింది. ఒకపక్క మనవడు, ఒక పక్క కొడుకుకూచుంటే పండుగనాడు భోజనం చెయ్యాలని కోరిక కలిగింది. ఈ చాపతీసేస్తే, అరటాకులు వేసుకోవచ్చు. రండి భోజనానికి.'

పార్వతమ్మ మగవాళ్లకు వడ్డించింది. తరువాత కోడలితో భోజనం చేసింది. ఎంగిళ్లు ఎత్తిన తరువాత అక్కడే చాప పరచాడు నారాయణ. దీక్షితులుగారు కూర్చొని సావకాశంగా తాను తెచ్చిన తాంబూలం వేసుకున్నారు.

'నారాయణా! నీతో రెండు విషయాలు చెప్పడానికి వచ్చాను. నువ్వు, నీ భార్య కూర్చొండి.'

ఆయన చెప్పారు.

'మీ పెద్దన్నయ్య నా మీద దావా వేసిన సంగతి నీకు తెలుసా?'

'తెలియదు' అన్నాడు నారాయణ.

'కిందటి ఏడు, వాడికేం బుద్ధిపుట్టిందో, నాకు వాడొక ప్లీడరు నోటీసు యిచ్చాడు. మనయిల్లు పిత్రార్జితమని, తనవంతు వెంటనే వేరు చేసి యివ్వవలసిందని వాడు దావా వేశాడు.

'అంత అన్యాయానికి ఒడికట్టుకున్నాడా?'

'అన్యాయమేముంది - మన యిల్లు చాలపురాతనమైనది. ఏడువందల ఏభైగజాల జాగా విలువ వస్తుంది. మనప్రాంతాలలో చదరపు గజం ధర ఎంతో తెలుసా?'

'తెలియదు'

'నాలుగువేల రూపాయలు - అంటే మనయిల్లు ముప్పై లక్షలు విలువచేస్తుంది. తనవంతు జాగా అమ్ముకొని ఫ్లాటుకొనుక్కుంటానన్నాడు.'

'అన్నీ బాగానే ఉన్నాయి, తండ్రి మీదే వాడు దావావేశాడా?'

'నేను వాడిని పెద్దవాడిని చేసి చదువు చెప్పించినందుకు నాకు వాడిచ్చిన బహుమతి లాయరు నోటీసు.'

'చిన్నన్నవద్దని చెప్పలేకపోయాడా?'

'వాడుతటస్తంగా ఊరుకున్నాడు.'

'అయితే ఇల్లు అమ్ముకోవలసిందే?'

'మన యిల్లంటే నాకు ప్రాణం. తరతరాలబట్టి నా తండ్రి తాతలకు ఆశ్రయమచ్చినదది - నా దేవతార్చనకు కావలసిన పువ్వులు పెరటి నుంచి వస్తాయి - కొబ్బరి నీటివంటి నూతినీరు - ప్రశాంతమన వాతావరణం - దీనిని అమ్ముకొని అక్కడకట్టే అపార్టమెంట్లలో ఉండమని మీ అన్నలసలహా!'

'ఎంత దుర్మార్గమైనపని.'

'మీరందరికి తెలియని విషయమొకటి ఉంది. మనకున్న నాలుగెకరాల భూమి చాలకాలం కిందఅమ్మివేశాను. ఆ డబ్బుతో వేయిగజాల స్థలం ఊరిపొలిమేరల్లో కొన్నారు. ఈ ఇరవై సంవత్సరాలలో అది నగరానికి మధ్య భాగమయింది. అక్కడ గజం మూడువేల రూపాయలకు అమ్ముతున్నారు. మీ అన్నలతో రాజీపడి, ముగ్గురు కొడుకులకు దానిని అమ్మగా వచ్చిన డబ్బు పంచివేశాను.'

'నిజంగా?'

'అవును నిజమే నీకే సంగలేవీ తెలియదు. మీ అన్నలిద్దరూ వాళ్లవంతు డబ్బుతీసుకు

పోయారు. నీవంతు మాత్రం...'

'నేనేమీకోరలేదు. కష్టపడితే సంసారం చేసుకోగలను. మీరు బతికున్ననాళ్లు అనుభవించండి. తరువాత సంగతి ఆలోచించుకోవచ్చు.'

'అవును, ఈపాటి మాటకూడా మీ అన్నలు అనలేదు. నీవంతు పదిలక్షలకు, అక్కడ కట్టబోయే అపార్టమెంటులలో, రెండవ అంతస్తులో ఒకటి తీసుకున్నాను. దిగువను వాళ్లు షాపులు కడుతున్నారు. ఒక షాపు కూడా నీకోసం తీసుకున్నాను. ఈ రెండింటికి ఏడులక్షలయింది.'

కోడలి ముఖంవేపు ఆయన చూశారు.

ఆమె కళ్లంటనీరు.

'ఇంకావిను అపార్టమెంటులు తయరయేసరికి ఆరునెలలు పడుతుంది. అంతవరకు నువ్వు ఉండడానికి మంచి అపార్టమెంటు ఉచితంగ ఇస్తారు. కంట్రాక్టర్లు, నీకు నీ ఫ్లాటు, షాపు అప్పచెప్పినప్పుడు రెండు లక్షలిస్తారు. ఈ అగ్రిమెంటు వాళ్లకు చూపించగానే వెంటనే లక్షరూపాయలిస్తారు.

శ్రీమన్నారాయణ తండ్రిమాటలకు నిరుత్తరుడయాడు. కళ్లంటనీరు. వజ్రంకన్న ఆయన హృదయం కఠోరమనుకున్నాడు. అది కుసమంవలె మృదువైనదని ఇప్పుడు తెలుసుకున్నాడు.

దక్షితులుగారు చేతి సంచీ నుండి పత్రాలు తీసి, భార్య చేతి మీదుగా కోడలికిప్పించారు.

సంచి నుండి, కొత్తబట్టలు తీసి మనుమడికి యిప్పించారు.

ఆ చిన్న కుటుంబం దీక్షితులపాదాలకు, పార్వతమ్మ పాదాలకు సాష్టాంగ ప్రణామం చేస్తే ఆ దంపతులు దీవించిఅన్నారు.

'ఇది మా కర్తవ్యం.'